# కొండమీద గొర్రెల మంద

## -ఎమ్.వి.వి.సత్యనారాయణ

అర్ధరాత్రిపూట ఆ కొండమీద గుడిగంటలు అదేపనిగా మోగుతుంటే కొండ కింద గ్రామం మేల్కొంది. పిల్లా పిచికా దగ్గర్నుంచీ ముసలీ ముతకా వరకూ అదిరిపడి లేచి కూర్చున్నారు.

ఇళ్లల్లో దీపాలు వెలిగాయి.

వీధుల్లోకి ఒక్కొక్కరే కళ్లు నులుముకుంటూ వస్తున్నారు.

''నర్సిమ్మూర్తి కొండమీద ఇంత రాత్రిపూట ఎవరున్నారు?''

''ఆశ్చర్యం! కొండమీదకు ఎవరు వెళ్లి వుంటారు? చీకటి. అందులోనూ ఇది ఆషాఢమాసం. కొండమీద ఎవరికేం పని?''

''దేవుడికోసం వెళ్లినవాళ్లు మాత్రం కాదు. ఎవరికో మాత్రం పని పడింది''

''అయితే?''

''ఇంకేముంది? అందరి కళ్లు వాటిమీదే కదూ? ఒకవేళ పూజారి కొడుతున్నాడేమో? గుడి పక్కనే వుంటాడుకదా!''

నాలుగు వీధులు కలిసే చోట రచ్చబండ. క్రమంగా గ్రామస్థులతో రచ్చబండ నిండుతోంది.

రామయ్య తాత చేతికర్ర ప్రక్కనబెట్టి పంచె మడత లోంచి చుట్ట బైటికి తీశాడు. చుట్ట తుదను పటుక్కున కొరికి తుప్పుమని ఉమ్మాడు.

ఎవరో అగ్గిపుల్ల గీశారు. చుట్ట ముట్టుకుంది. గుండెలనిండా ఒక్క దమ్ములాగి చిన్న దగ్గు దగ్గి చుట్టూ చూశాడు రామయ్య తాత.

''అన్ని ఇళ్లల్లోంచి జనం వచ్చినట్టేనా?'' అడిగాడు రామయ్య తాత.

అయిదారు నిముషాలు నిశ్శబ్దం తరువాత ఒక పెద్దాయన ''వచ్చారు అన్నయ్యా'' అన్నాడు.

గుడిగంటలు ఇంకా మోగుతూనే ఉన్నాయి.

''మీ ఇంట్లోంచి ఎవరూ కొండమీదకి వెళ్లలేదుకదా! ప్రతి ఒక్కరూ చూసుకోండి''

''ఎవరు వెళ్తారన్నయ్యా! కొండ చుట్టూ చిట్టడివి. పిలిస్తే పలికే దిక్కులేదు. చీకటి. పూజారీ, ఆయన కుటుంబం అక్కడే వుంటారు కదా''

రామయ్య తాత విచారం కలగలిపిన నవ్వొకటి గుంపు వైపు విసిరాడు.

''ఆఁ! నరసింహస్వామి ఒంటిమీద బంగారం, ముత్యాలు, రత్నాలు, పగడాలు. దరిద్రుడెవడికైనా నోరూరుతుందికదా''

''అమ్మో దేవుడి సొమ్ము. అలా అనుకుంటేనే కళ్లు పోతాయి''

''నీకూ నాకూనూ. దేవుడంటే భయం, భక్తీ వున్నవాడికి కళ్లు పోతాయి. అవేమీ లేనివాడి సంగతేమిటి?''

గణగణ... గణగణ... దూరం నుండి ఒక మంద్ర స్వరంలాగా.

''అన్నట్టు అన్నగారూ! ఈ రచ్చబండ మీదే పండుకునేవాడు కదా పిచ్చాడు. వాడొక్కడే కనిపించడంలేదు.''

''ఆఁ''

క్షణాలమీద ఆశ్చర్యార్థకంగా గుంపుల్లో చొరబడింది.

''వెదకండ్రా వెదవనాకొడుకును''

గంటల చప్పుడు ఆగిపోయింది.

పిచ్చోడికోసం వేట ప్రారంభమయింది.

వాళ్లకి తెలియదు అంతకు సరిగ్గా ఇరవై నాలుగ్గంటల క్రితం-

అదే గ్రామం పొలిమేరల్లో ఒక ఆడా ఒక మగా చివరి బస్సు దిగారు. మగవాడి మొహమంతా పరుచుకునేలాగా తలపాగా వుంది. ఆడమనిషి చుట్ట కాలుస్తూ ఆ వ్యవహారం ఇతరుల కంట పడకూడదన్నట్లు మొహం మీద చెంగు వేసుకుంది. ఆ గ్రామంలో పరిచయం వున్న వాళ్లలాగా ఇద్దరూ నిశ్శబ్దంగా ముందుక్కదుల్తున్నారు.

గ్రామంలో ఎక్కడో కుక్క మొరిగింది.

ఆమె భుజం పట్టి ఆపాడు.

''మొత్తం ఎనిమిది వీధులు ఈ గ్రామం. ఆ చివరి వీధిలో ఎక్కడో మొరిగింది కుక్క. ఇక్కడ్నించీ రొట్టెముక్కలు పర్చుకుంటూ పోవడం మంచిది''

ఆమె తలూపింది.

అతడి భుజాన వ్రేలాడే సంచీలోంచి రొట్టెముక్కలు తీసి ఇద్దరూ అక్కడక్కడా పడేలాగా చల్లుకుంటూ ముందుక్కదుల్తున్నారు. రెండో మూడో కుక్కలు మొరుగుతూ వాళ్లవైపు రావడం, మధ్యలో రొట్టె ముక్కలు నోటికందడం అంతా గమ్మత్తుగా జరిగిపోయింది.

ఒక గంట తర్వాత అంటే సరిగ్గా ఒంటిగంటకి వాళ్లిద్దరూ నర్సింహమూర్తి కొండపాదం దగ్గరున్నారు. అతడు బాటరీ లైటు వెలిగించి నేలబారుగా వుంచి చేతివేళ్లు అడ్డం పెట్టాడు.

సన్నపాటి కాలిబాట, బాటకిరుపక్కలా తుమ్మడొంకలూ, బండరాళ్లు, రక్కిసికంపలూ, కటిక చీకట్లో ఎక్కడో కీచురాళ్లు అరుస్తున్నాయి.

''ఇక్కడ్నించి సరిగ్గా అరమైలు దూరం. కుక్కల బెడద లేదు'' అంటూ అతడు కిర్రుచెప్పుల జతలు బైటికి తీశాడు.

''ఇక పాముల బెడద కూడా లేదన్నమాట'' ఆమె నవ్వి అంతవరకూ ధరించిన చెప్పులు తొలగించి కిర్రుచెప్పులు తొడుక్కుంది.

అతడు కూడా చెప్పులు తొడుకున్నాడు. పాత చెప్పుల జతలు జాగ్రత్త పెట్టాడు. కిర్రుకిర్రు చప్పుడు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు.

ఎప్పుడూ అలవాటైన చప్పుళ్లు ఒకేసారి వినిపించకుండా పోతే ఎవరికైనా పిచ్చెక్కుతుంది. అసలే పిచ్చోడికి ఇంకా ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు?

అందువల్లే రచ్చబండ మీద లేచి కూర్చున్నాడు పిచ్చోడు.

ఒక గంట క్రితమో అరగంట క్రితమో ఇవతలి వీధిలో కుక్క మొరిగింది. తరువాత రెండు మూడు కుక్కలు మొరగడం, ఊరుకోవడం జరిగాయి. అంతే! కుక్కలు అటు దరిమిలా ఇక మొరగలేదు. ఇక్కడో కుక్కా, అక్కడో కుక్కా మొరుగుడును అంది పుచ్చుకోవడం జరగాలి. అదీ జరగలేదు.

ఎందుకిలా జరిగింది?

పిచ్చోడు లేచాడు. రచ్చబండ నుండి కిందకి దిగి ఒళ్లు విరుచుకున్నాడు. మబ్బుగా పెరిగిన గడ్డం గోక్కున్నాడు. జుత్తును పీక్కుంటున్నట్టు అభినయించి తల వెనక్కి విసిరాడు. ఒక వీధిలోకి బయలుదేరాడు. అటు తిరిగి ఇటు తిరిగి వీధిలోంచి మరల నాలుగు వీధులు కూడలికి వచ్చాడు.

అతడి చేతుల్లో రెండు కుక్కలు వ్రేలాడుతున్నాయి. వాటిని రచ్చబండమీదుంచి తిరిగి బయలుదేరాడు.



★★★

తెల్లవారింది.

కొండమీది గుడికి భక్తులు వస్తున్నారు. వెళ్తున్నారు. అర్చనలు చేయించుకుంటున్నారు. గర్భగుడి ఎదుట వ్రేలాడుతున్న రెండు గంటల్నీ మోగించి మరీ నివేదనలు చేసుకుంటున్నారు.

గుడిమీద సందడి ఉదయం పదకొండు గంటలయ్యేటప్పటికి క్రమంగా పల్చబడింది. కొంతసేపుపాటు పూజారి గుడి తలుపులు మూసి వుంచాడు.

గుడి వెనుక మండపం చాటున ఒక స్టోర్‌రూం వుంది. ఆ మండపంలో ఇద్దరు వ్యక్తులున్నారు. వాళ్ల దగ్గరకొచ్చాడు పూజారి.

వాళ్లవైపు తిరుగుతూనే అతడి చూపులు వికారంగా మారిపోయాయి.

వాళ్లిద్దరూ రకానికి ఆడామగా కావచ్చుగానీ ఒకేరకమైన రోగానికి గురై బాధపడ్తున్నారు. చేతులకూ కాళ్లకూ గుడ్డపట్టీలు. అవీ ఎర్రగా తడిసి ఉన్నాయి. మొహమంతా ఒకరకమైన మచ్చలు, బొడిపెలు.

''ఎవరికీ రాకూడని జబ్బు మీ ఇద్దరిదీ'' నోరు చప్పరించాడు పూజారి.

వాళ్లిద్దరూ తలలూపారు.

''మీరు ఇక్కడుండగా ఇంతవరకూ ఎవరికంట్లోనూ పడలేదు కదా''

తలలు అడ్డంగా తిప్పారు వాళ్లు.

''ఇందాక ఇటుపక్క ప్రదక్షిణానికొచ్చారు కొంతమంది. వాళ్ల కంట కూడా పడలేదుకదా''

తలలు అడ్డంగా తిప్పారు వాళ్లు.

''ఇందాక ఇటుపక్క ప్రదక్షిణానికొచ్చారు కొంతమంది. వాళ్ల కంట కూడా పడలేదు కదా''

''ఊహూ''

''మంచిది. ఏదీ మీరిస్తానన్న డబ్బు?''

దుస్తుల చాటు నుండి డబ్బుతీసి ఇచ్చాడు మగవాడు. ఆ వ్యవహారం తనకి సంబంధించినట్టు కాదనిపించేలా చూస్తోంది ఆడది.

ఆసహ్యం పైకి కనిపించనివ్వకుండా డబ్బు అందుకున్నాడు.

''డబ్బుకి- అందునా తేరగా వచ్చే డబ్బుకి అంటూ సొంటూ ఏమి టి?'' సణుక్కున్నాడు మగాడు.

''ఈ రాత్రికి మాత్రమే వుండి రేపు తెల్లవారకుండానే వెళ్లిపోవాలి సుమా'' ఏదో ఒకటి అనాలి కాబట్టి అనేశాడు పూజారి.

ఆడామగా తలలూపారు.

''అసలే కుష్టురోగం. మిమ్మల్ని ఈ గుడి ఆవరణలో చూశారంటే నా పరువేంకాను?''

మగాడు వెకిలిగా నవ్వాడు.

లంచం తీసుకుని తమ ఇద్దరినీ ఇక్కడే వుంచినందుకు తూకంగా అవతల తక్కెట్లో ఒక రాయి వేశాడు పూజారి.

తర్వాత వాళ్లిద్దరివైపు పరిశీలనగా చూసి ''బైటికేం వెళ్తారు. కాస్తంత చక్రపొంగలీ, కొబ్బరిముక్కలూ పంపుతాను. ఏదో కాలక్షేపం చేసేయండి. మా ఆవిడ ఇంట్లోకి రాకూడదు. లేకపోతే'' అన్నాడు.

''లేకపోతే కోడికూరతో విందు చేసేవాడివా?'' గొణుక్కుంది ఆడది.

వీళ్లు ఇక్కడ మాటల్లో వుండగానే కొండ క్రింద గ్రామంలో అలజడిగా వుంది.

''ఇదిగో ఈ పిచ్చోడి మాట పట్టుకుంటే ఇక ఇంతే సంగతులు'' అరిచాడు రామయ్య.

పిచ్చోడు గుండెలు కొట్టుకుంటూ ''ఏయే...యేం...'' అని సైగలు చేశాడు.

వాడు ఏరుకుంటూ వచ్చిన ఎండు రొట్టెముక్కలు రచ్చబండమీద పడున్నాయి. వాడి సైగలు గ్రామస్థులకు అర్థమవుతున్నాయి. రొట్టెముక్కలు తిని స్పృహ తప్పిపోయినట్టు వాడు చెప్పిన కుక్కలు తెల్లవారకుండానే హాయిగా తిరగడం మొదలుపెట్టాయి.

వాడు మరలా సైగలు చేశాడు. చేస్తూనే నెత్తీనోరూ మొత్తుకున్నాడు. కుక్కలకు తిరిగి రొట్టెముక్కలు పెట్టమంటున్నాడు వాడు. వాడి పోరు పడలేక ఆ పని చేశారు.

కుక్కలకేమీ కాలేదు.

''అయితే ఈ రొట్టెముక్కలు ఇక్కడికెలా వచ్చాయో?'' ఒక జిజ్ఞాసువు ప్రశ్న లేపాడు.

''ఎవడో తుంటరి కుర్రాడి పనై వుంటుంది''

''అవును. మొన్న ఎవడో కర్రపెండలం దుంప ముక్కలు విసిరాడు. రెండు మూడు వీధుల్లో కనిపించాయి''

రచ్చబండ చుట్టూ చేరిన నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడుకుంటూ వుండిపోయారు.

''ఎవడో చేతబడో, చిల్లంగో చేస్తున్నట్టున్నాడు. వాడి అంతు కనుక్కోవాల్సిందే'' ఒక పెద్ద తలకాయ అభిప్రాయపడింది.

గొర్రెల్ని మేపే లోవరాజు చిటిక వేశాడు. ''మీరంతా ఇలా అంటుంటే నాకో సంగతి చెప్పాలనిపించింది'' అంటూ చుట్టూ చూసి ఖద్దరు బనీనూ, దానికింద గోచీ సర్దుకున్నాడు.

ఆ వ్యవధిలో అందరూ అటే తలలు తిప్పారు.

''మొన్న స్మశానం అవతల మేపుతున్నాను గొర్రెల్ని. ముగ్గురు ఆడాళ్లు చెంబులు పట్టుకుని వచ్చారు. గోరీల వెనక్కి, తుప్పల వెనక్కి వెళ్లి కూర్చున్నారు. స్మశానంలో ఇంత ధైర్యంగా వచ్చిన వాళ్లెవర్రా అని చూశాను. తుప్పల వెనుక ఆడాళ్లు లేరు'' ఆగాడు లోవరాజు.

సూదిపడితే వినిపించేటంత నిశ్శబ్దం.

''మూడు నల్లమేకలు అటూ ఇటూ గెంతుతున్నాయి'' అంటూనే ఆయాసపడిపోయి ఆయాసాన్ని అణుచుకున్నాడు లోవరాజు.

''చెంబు పట్టుక్కూర్చున్న ఆడవాళ్లు నీకు కనుమరుగ్గా కూర్చున్నారేమో?''

''లోవరాజును అలా కొట్టి పారేయకండి. నాకూ అచ్చగా ఇలాగే అనుభవమయ్యింది. అయితే మేకలకు బదులు గేదెదూడలు మూడు కాదు రెండు.''

''గేదె వట్టిపోయిందని మా నూకాలమ్మ పోయినవారమంతా మా ఎదురింటి ముత్తేలమ్మని పట్టుకు తిట్టింది'' మరొకడి ఇంటి చరిత్ర వెలుగు చూస్తోంది.

''ముత్తేలమ్మేం చేసింది?'' అడిగాడు ఇంకొకడు-దాన్ని వుంచుకున్నవాడు.

మొత్తానికేమైతేనేం - ప్రసంగం దారి మళ్లిపోయింది.

ముత్తేలమ్మ ఊళ్లోలేదుట. ప్రస్తుతం వూర్నించి రాగానే పళ్లు పీకేయాలని తీర్మానమైపోయింది.

పిచ్చోడికి అంతో ఇంతో పిచ్చి కుదిరినట్టుంది. నోరు మూసుకున్నాడు.

సాయంకాలమయింది.

పిచ్చోడు రచ్చబండ మీదికి చేరలేదు. గ్రామమంతా కలియ తిరుగుతున్నాడు. స్మశానంలో కొంతసేపు గడిపాడు. కొండకి వెళ్లే దారిలో తచ్చాడాడు. ఏమీ అర్థం కావడంలేదు వాడికి. ఇంకా ఇంకా పిచ్చెక్కుతోంది.

ఏం తిన్నాడో ఏం తాగాడో వాడికే తెలీదు. ఎటు తిరుగుతున్నాడో కూడా తెలీదు.

తుప్పల్లో వాడికి ఇద్దరు కొత్తవాళ్లు కనిపించారు.

ఆడమనిషి చేతిలో నీటి చెంబు ఉంది. మగాడు అంత దూరంలో నిలబడి ''ఎవరూ ఇటు రారులే'' అన్నాడు.

వాళ్లిద్దరూ రోగిష్టుల్లా వుండడం పిచ్చోడికి తెలుస్తోంది.

ఆడమనిషి ఎప్పుడు మేకగానో, గేదెగానో మారుతుందో చూద్దామని వాడక్కడే కాపువేసుక్కూర్చున్నాడు.

★★★

''ఎక్కడుంది ఆ దొంగముం..'' అడిగాడు మగవాడు.

ఆమె ఖాళీ చెంబుతో వచ్చింది.

''నాకు తెలియదని చెప్పానా?''

''మరి డబ్బు ఎలా అందించమంది'' అడిగాడు అతడే పద్మారావు.

''ఇంటికి వచ్చే ఇవ్వమంటుంది. ఇంకేమంటుంది?'' అంది- ఆమె కుమారి.

నిట్టూర్చాడు పద్మారావు.

కుమారికీ, తనకీ జత కలిసింది. తామిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇంతలో అంతకుముందు చేసిన దొంగతనం ఒకటి వెలుగులోకి వచ్చింది. దానితో తనకి జైలుశిక్ష పడింది.

కుమారి తనను వెతుక్కుంటూ సెంట్రల్‌జైలుకు వచ్చింది. పట్నంలో బ్రోతల్ చేతిలో చిక్కుకుంది. కుమారిని ఆమె లోబర్చుకుంది. ఒక బ్రోకర్‌కి అమ్మేసింది. అతడి దగ్గరే తిరిగి కొనుక్కుని కుమారిచేత వ్యభిచారం చేయించడం మొదలుపెట్టింది.

కుమారి వీలున్నప్పుడల్లా జైలుకి వెళ్లి అతడిని కలుసుకునేది.

పద్మారావు విడుదలయ్యాడు.

అంతకాలంపాటూ కుమారి ఒక యమకూపంలో చిక్కుకుపోయినా ఏమీ చేయలేకపోయాడు.

బ్రోతల్‌తో రాజీకొచ్చాడు.

''నరసింహస్వామి నగలు కావాలి'' అంది బ్రోతల్.

గతుక్కుమన్నాడు పద్మారావు. ఇంతకుముందు కూడా ఒక గుడిలో దొంగతనం చేసినందుకే జైలుశిక్ష పడింది.

ఇప్పుడు కుమారిని ఊబిలోంచి పైకి లాగడానికి తిరిగి గుడిలోనే దొంగతనం చేయాలా? అందులోను నరసింహస్వామి గుడికి అంతో ఇంతో గొప్ప పేరుంది. స్వామి ఒంటిమీద ఎప్పుడూ పదిహేను, ఇరవై తులాల బంగారం వుంటుంది. బంగారం తొలగిస్తే స్వామికి ఇష్టముండదని భక్తులు చెప్పుకుంటారు.

తన అదృష్టం బాగుంది. స్వామి ఒంటిమీద ఈ ఆషాఢమాసం అంతకాలం బంగారం, విలువైన రాళ్లు అలాగే ఉంచుతారు.

అమావాస్య రాత్రి ముహూర్తం పెట్టాడు పద్మారావు.

కుమారితో కలసి ముందురోజే ఆ గ్రామానికి బయలుదేరాడు.


పరిస్థితులు బాగానే ఉన్నాయి.

కుమారి కూడా ధైర్యంగా ఉంది.

''నేను చెడిపోయినదాన్ని. నా గురించి ఇంత ప్రమాదానికి సిద్ధపడ్తున్నావేం?'' అంది కుమారి.

''నా గురించి వచ్చావు నువ్వు. ప్రమాదంలో చిక్కుబడిపోయావు. అందువల్ల నిన్ను రక్షించుకోవడం నా బాధ్యత''

ఆమె కళ్లు చెమర్చాయి. 'రక్షించుకోవడం' గొణుక్కుంది.



## సొంత డబ్బా!

ఒక్క సినిమా హిట్టయిందో లేదో రాణీ ముఖర్జీకి అప్పుడే స్టైయిల్ ఎక్కువైందంటున్నాడు బాలీవుడ్ జనాలు. తనకి నచ్చే స్టార్ ఎవరూ అని ఎవరైనా అడిగితే- ఇంకెవరూ నేనే! అని చెప్తూ ముసిముసిగా నవ్వుకుంటోందిట. 'ఏం నేను మంచి నటిని కానంటారా? అసలు నేను బోర్న్ ఏక్ట్రస్‌ని తెలుసా?' అని వగలుపోతోందిట. ఫస్ట్ పిక్చర్ ఫట్ కొట్టేసిన తర్వాత సెకండ్ పిక్చర్ 'గులామ్' ఏదో హిట్టయింది. ఇలా ఒక్క సినిమా హిట్టు కాగానే మరీ ఇంతగా సొంత డబ్బా కొట్టుకోవాలా? గడుసు పిల్లే అని బుగ్గలు నొక్కుకుంటున్నారు ఇది విన్న వాళ్లు.

-జె.ఎం.

బ్రోతల్ వెనుక పెద్ద పెద్ద పోలీసు అధికారులున్నారు. ఏదో పేరు చెప్పి తనని నామరూపాలు లేకుండా చెయ్యడం వాళ్లకో పెద్ద పనికాదు.

పద్మారావు చేతిని పట్టుకుని చాలాసేపటివరకూ ఏడుస్తూ అలాగే వుండిపోయింది. పద్మారావు ఆమె కళ్లు తుడిచి గుడివైపు నడిపించాడు.

నిట్టూర్చాడు పద్మారావు.

క్రమంగా చీకటి పడుతోంది.

డబ్బులు తీసుకుని పూజారి వాళ్లకి రాత్రి భోజనం కూడా ఏర్పాటు చేశాడు.

''మీకీ కుష్టురోగం ఎలా సంక్రమించింది?'' అడిగాడు పూజారి.

వాళ్లిద్దరూ ఏదో కహాని అల్లి చెప్పారు.

''అయినా కుష్టురోగం సంక్రమించడానికి ప్రత్యేకమైన కారణం ఉండాలా అయ్యావారూ! దేవుడు మన కర్మకి ఇదీ ఫలితం అంటే అనుభవించక తప్పుతుం దా? నరసింహస్వామి వారు ఇక ఎక్కడా స్థలం లేనట్టుగా స్తంభంలోంచి పుట్టుకురాలేదా? ఆయనకే తప్పనప్పుడు ఇక మనబోటివారి గురించి చెప్పేపనేముంది?''

పూజారి తన్మయుడైపోయాడు.

ఇంత గొప్పగా భగవంతుడి తత్త్వం తెలిసినవాడు ఒక రోజంతా ఆయన సన్నిధిలో గడపడానికి రావడం తక్కువ సంగతా?

భోజనం నిమిత్తం తీసుకున్న డబ్బు ను ఎంచి పద్మారావు చేతిలో పెట్టాడు పూజారి. ఆయన పాదాలమీద వాలిపోయాడు పద్మారావు.

కుమారి కళ్లనీళ్లతో బొమ్మలాగా నిలబడిపోయింది.

★★★

గుడిపక్కనే పూజారిగారి ఇల్లు.

పూజారిగారింట్లో ఎవ్వరికీ స్పృహ లేదు.

పద్మారావు, కుమారీ దీపాల వెలుగు తగ్గించి ఆ ఇంట్లోంచి కదిలి గుడిలో అడుగుపెట్టారు. వాళ్లిద్దరూ ఇప్పుడు కుష్టురోగుల్లాగా లేరు. నవనవలాడే వంకాయల్లాగా ఉన్నారు.

''నువ్వు గర్భగుడి తాళం కప్ప తెరువు. ధర్మకర్త విడిగా వేసుకుని వెళ్లిపోయిన తాళం కప్పను నేను పగలగొడ్తాను. అంతకంటే ముందీ పని చేయాలి'' చురుగ్గా కదిలాడు పద్మారావు.

''ఏం చేస్తున్నావు?'' మెల్లగా అడిగింది కుమారి గర్భగుడి ముందు నడుస్తూ.

''ఇదిగో రెండు గంటలూ చెరోవైపూ పక్కస్తంభాలకున్న కొక్కాలకు తీగతో బిగిస్తున్నాను''

''ఎందుకు?''

''ఈ దేవుడికి మహిమలున్నాయి. గంటలు మోగితే''

పరిహాసంగా నవ్వింది కుమారి.

పద్మారావు పట్టించుకోలేదు. మొదటి గంటను పక్క స్తంభపు కొక్కానికి బిగించి తీగ చుట్టాడు. దాన్ని పరీక్షించి అంత చప్పున తీగ విడివడదని నిశ్చయించుకుని రెండో స్తంభానికున్న కొక్కానికి రెండో గంటను కూడా అదే పద్ధతిలో బిగించాడు.

అప్పటికి ఒక తాళం కప్పు తెరిచి రెండో తాళం కప్పుతో కుస్తీలు పడుతోంది కుమారి. పద్మారావు చిన్నగా నవ్వి ఆమెను సమీపించాడు. సన్నపాటి చువ్వను రెండోతాళం కప్పులో దూర్చి సుతారమైన సుత్తిదెబ్బలు క్రమం తప్పకుండా వేయడం మొదలుపెట్టాడు.

అతడి నైపుణ్యానికి తాళంకప్పు దాసోహమైపోయింది.

''పగలగొట్టే శ్రమ తప్పిపోయింది'' నవ్వాడు పద్మారావు.

పమిట చెంగుతో అతడి నుదురు తుడిచింది కుమారి.

''దేవుడు తనని తాను కాపాడుకోలేడని వీళ్ల నమ్మకం. అందువల్లే తాళం కప్పు మీద మరో కప్పు బిగించారు'' ఇనుప తలుపులు తెరిచి ఆ గది దాటి గర్భగుడిలో ప్రవేశించాడు పద్మారావు.

గాలి ఆడక ఆ రెండు గదులూ వెచ్చగా ఉన్నాయి.

ఆముదపు దీపం కాంతిని పెంచాడు పద్మారావు. నల్లరాతి విగ్రహం నిగనిగ మెరుస్తోంది. మనిషీ, మృగమూ కలసిన శిల్పం. కళ్ల ప్రాంతంలో వెండిరేకులు. మెడలో రత్నాలూ, ఇతర విలువైన రాళ్లు పొదిగిన హారాలు వేలాడుతున్నాయి. శఠగోపం మీద కూడా విలువైన రాళ్లూ, బంగారు పాదాలు పొదిగి ఉన్నాయి.

హారాలు లాగబోయాడు.

కుమారి భుజంమీద వ్రేలాడే సంచిని తెరిచి పట్టుకుంది.

అంతే! గణగణగణమంటూ గంట లు మోగుతూ ఒకదాన్నొకటి ఢీకొట్టుకుంటూ ఠంగ్ ఠంగ్.

మతులు పోయాయి వాళ్లిద్దరికీ.

వెనక్కి తిరిగి చూశారు. ఎవరూలేరు. ఎలా మోగాయి గంటలు. తీగలువిప్పి ఎవరు గంటల్ని మోగించారు?

పద్మారావుకు విగ్రహం, గర్భగుడీ, హారాలూ, కుమారీ... అంతా గిరగిర తిరుగుతున్నట్లు ఒకటే భావన. గొంతు తడారిపోతోంది.

తనకేమయ్యింది. ఇంతవరకూ వచ్చాక ప్రయత్నం విఫలం కావడమేమిటి? అయోమయంగా తయారయ్యింది పరిస్థితి.

పద్మారావు వణుకుతున్నాడు.

ఎన్నో రకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటినన్నింటినీ విని ఉన్నాడు పద్మారావు.

ఈ కొండమీద నరసింహస్వామికి దివ్యమహత్తులెన్నో ఉన్నాయట. తన నగలు ఎవడో అపహరించడానికొస్తే చూస్తూ వూరుకుంటాడా దేవుడు?

''మనం పారిపోవడం మంచిది'' గుటక పడలేదు పద్మారావుకు.

''ఎందుకు?'' అని అడగలేదు కుమారి. గంటలింకా గణగణలాడ్తున్నాయి.

దేవాలయంలోంచి ఇద్దరూ బయటపడ్డారు.

పొదల మార్గంలోంచి పరుగు లంకించుకున్నారు.

''గంటలెలా మ్రోగాయి?'' అంది కుమారి.

పద్మారావు మాట్లాడకుండా ఒకసారి వెనక్కి తిరిగి చూశాడు. తమకి దూరంలో ఒక నీడ కనిపిస్తోంది. ఆలయంలోని వెలుగుకు అడ్డంగా ఒక చీకటి రూపంలాగా!

పద్మారావులో భయం తగ్గింది.

ఆ నీడ మెట్లు దిగుతోంది.

''క్రింద ఊళ్లో అంతా మేల్కొన్నారు'' అంది కుమారి.

అప్పటికే రాయి అందుకున్నాడు పద్మారావు.

★★★

తూర్పు వెలుగులో ఆలయం కింద మెట్లమీద పిచ్చోడు పడిపోయి ఉన్నాడు. వాడి తల పచ్చడయిపోయింది. రాత్రి మాయమైపోయాక తిరిగి ఇప్పుడే వాడు గ్రామస్థుల కంటపడ్డాడు.

రామయ్య తాత నిట్టూర్చాడు.

''తన ఆస్తి పోకుండా వాడ్ని కాపలా పెట్టాడు దేవుడు. నిజంగా నరసింహస్వామి నిరూపణ కలిగిన దేవుడు'' అన్నాడు రామయ్య తాత.

గ్రామస్థులు తలలూపారు.

గొర్రెలమంద అప్పుడే కొండ ఎక్కుతోంది మేతకి!

★



## పాపం మోనికా!

మోనికా బేడీ ఉత్తరాది అమ్మాయే అయినా తెలుగులో 'తాజ్‌మహల్'లాంటి హిట్ చిత్రంలో నాయికగా పరిచయమైంది. ఆ తర్వాత మోహన్ బాబు సరసన సోగ్గాడి పెళ్లాం చిత్రంలో, సర్కస్ సత్తిపండులో ఆలీ సరసన, శివయ్య సినిమాలో రాజశేఖర్‌కి జంటగానూ ..ఇలా హీరోయిన్‌గా నటించిన మోనికా బేడీ ఇటీవల వచ్చిన చిరంజీవి చిత్రం 'చూడాలని వుంది'లో 'రామా చిలకమ్మా...' అనే పాటలో కనిపించడం ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. పాటలో అయితే పర్వాలేదు, కానీ గ్రూప్ డాన్సర్స్‌లో ఒకామెలా వుంది తప్ప క్లోజప్‌లేకపోవడం, పట్టి పట్టి చూస్తేగానీ ఆమె 'మోనికా బేడీ' అని పోల్చుకోలేని పరిస్థితి. ప్చ్! మోనికా!

-జె.ఎం.